క్లుప్తంగా

పైపులైను పనులు త్వరగా పూర్తి చేయండి



ఇనగండ్లలో పైపులైన్ పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకోండలు

సి.బెళగల్: మండలంలో జల్‌జీవన్ మిషన్ (మంచినీటి సరఫరా) పథకంలో భాగంగా జరుగుతున్న పైపులైను పనులను త్వరగా పూర్తి చేయాలని మండల అధికారులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకోండలు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఇనగండ్ల, కంబదహాల్ గ్రామాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట సి.బెళగల్, గూడూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గోనే నాయక్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి



ఉపాధ్యాయులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

సి.బెళగల్: పాఠశాలల పరిసరాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన మరుగుదొడ్ల పరిశుభ్ర వస్తువులను హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మునిస్వామి, సీఆర్పీలు శోభారాణి, నాగేష్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి



ఒండుట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

గడివేముల: జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధిహామీ పనులు కల్పిస్తామని నంద్యాల పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మెట్ట ప్రాంతాలైన ఒండుట్ల,ఎల్‌కే తండా గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పొలాల పనులు గ్రామంలో పూర్తి కావడం జరిగిందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు, రైతులకు అవసరమైన పనులను గుర్తించడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు చూపిస్తామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గని గ్రామంలో జరుగుతున్న రూఫ్ హార్వేస్టర్ వాటర్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ బాలాజీనాయక్, ఏపీఓ వెంకటరమణ, సర్పంచ్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



గడివేములలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రం డివేములలోని జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు జిందాల్ యాజమాన్యం స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియల్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసి కంప్యూటర్ ల్యాబ్‌ను జిందాల్ ప్లాంట్‌హెడ్ నవనీత్ కుమార్ చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సీఎస్ఆర్ కింద కల్పిస్తామన్నారు. అనంతరం ప్లాంట్‌హెడ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం

- వైఎస్ఆర్‌సీపీ పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం
- ఇంటికే ప్రభుత్వ పథకాలు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్



మామిదాలపాడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్,



కోడుమూరు మండలం అమడగుంట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కర్నూలు సిటీ/కోడుమూరు రూరల్/గూడూరు: ప్రజాసంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగనన్ననే మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోడుమూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. కర్నూలు అర్బన్ పరిధిలోని మామిదాలపాడు (38వ వార్డు సచివాలయం), రూరల్ మండల పరిధిలోని తొలిశాపురం, కోడుమూరు మండలపరిధిలోని అమడగుంట్ల, గూడూరు పట్టణంలోని తూర్పు బీసీ కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా చోట్ల ఎమ్మెల్యే సుధాకర్ వైఎస్ఆర్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేనటువంటి సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఆయన అధికారంలో ఉంటేనే ఆ పథకాలు అందుతాయన్నారు. గతంలో పేదలకు సంక్షేమ పథకాలకు అర్హత అనేది రాజకీయ నాయకులు నిర్ణయించే వారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటికి వచ్చి అర్హులను గుర్తించి పథకాలను అందజేస్తున్నారన్నారు. తెలుగు దేశం పాలనలో చంద్రబాబు రైతులకు, మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు.

ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దు

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు అవే పథకాలను పేర్లు మార్చి అమలు చేస్తామని చెబుతున్నారని ఎమ్మెల్యే సుధాకర్ మండిపడ్డారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. పేదలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ నేత పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని, మీరందరూ వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తుంగభద్ర నది తీర గ్రామాల్లో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

- మామిదాల పాడులో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కార్పొరేటర్ గిబ్సన్, వైస్ ఎంపీపీ నెహిమియా, భాస్కర్, రాంబాబు, సచివాలయ కన్వీనర్ యాకోబు, మల్లికార్జున, మహేశ్వరరెడ్డి, మద్దిలేటి, రామకృష్ణ, చిన్నలు పాల్గొన్నారు.
- అమడగుంట్లలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఎం పుష్పావతి, ఉపసర్పంచు మోదీన్ బాషా, ఎంపీటీసీ సభ్యులు తిరుపతయ్య, స్థానిక నేతలు మధుమోహన్‌రెడ్డి,సుధాకర్ రెడ్డి, నంద్యాల శ్రీను, శ్రీరాములు, బాలు పాల్గొన్నారు.
- తొలిశాపురంలో జరిగిన కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అనురాధ, మండల కన్వీనర్ మహబూబ్ బాష, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నెహిమియా, కె.మధు, అయ్యస్వామి, రంగన్న, ఆదాము, ప్రసాద్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.
- గూడూరు తూర్పు బీసీ కాలనీలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు జే.ఆబేల్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.
- మండలంలోని బూడిదపాడు గ్రామంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మౌలాలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలి అంటే సీఎంగా జగన్ ఉండాలన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా ప్రజా ధనం లూటీ చేశారని విమర్శించారు. సర్పంచ్ వీరన్న, ఎంపీటీసీ చంద్రమ్మ, నాయకులు సుబ్బన్న, నాగరాజు, వీరశేఖర్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

పాణ్యం:18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్ శుక్రవారం తెలిపారు. 2024 జనవరి1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులను స్థానిక సచివాలయాల్లో లేదా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

పాణ్యం: దుకాణదారులు రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయితీ ఈఓ బాలాజినేయులు హెచ్చరించారు. శుక్రవారం బస్టాండ్ ఆవరణలో ఆయన దుకాణదారులతో మాట్లాడారు. చెత్తాచెదారాన్ని బయట పారవేయకుండా డస్ట్‌బీన్‌లను ఉపయోగించాలన్నారు. చికెన్ దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను ఇతర ప్రాంతాలను తరలించాలన్నారు.

రేపు గుంటూరులో రజక ఆత్మగౌరవ మహాసభ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 26వ తేదీ చలో గుంటూరు రజక ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో చంద్రబాబు 50 సంవత్సరాలు వయస్సుగల రజకులకు పింఛన్ ఇస్తానని నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టే ఆత్మగౌరవ మహాసభకు ఉమ్మడి జిల్లా నుంచి రజకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



పదవతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ హనుమంతరావు

కోడుమూరు రూరల్: ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తప్పవని కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి పది విద్యార్థులను పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్‌ఎం ప్రతి రోజు ఉపాధ్యాయుల దగ్గరుండి పాఠాలు చెప్పే విధానాన్ని పర్యవేక్షించాలన్నారు. కాగా వర్క్ బుక్స్ సరిదిద్దని ఇద్దరు ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈఓ మెమోలు జారీ చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య ఆదేశం

కల్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య ఆదేశించారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, యూపీహెచ్‌సీ కల్లూరును ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు సంభవిస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు.

స్పోర్ట్స్

ఆడుదాం ఆంధ్రను జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని తహసీల్దార్ జయన్న అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీడీ, పీఈటీలతో తహసీల్దార్ జయన్న, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓలు శరభయ్య, వసంత లక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు గ్రామ స్థాయిలో, డిసెంబర 21 నుంచి 2024జనవరి 4వరకు మండల స్థాయిలో, జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడీ, ఖో-ఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల 15 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు ఆయా గ్రామ సచివాలయాల్లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్) : విద్యార్థినులు, యువతులు వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. జోసఫ్ లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండో రోజు వివిధ విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతల వివరాలను ఆయన వెల్లడించారు. 40 కిలోల విభాగంలో విజయ నగరం జిల్లాకు చెందిన వి. రమాదేవి బంగారు పతకం సాధించింది. బి. సిరి చందనా (కడప, రజతం), పావని (పశ్చిమగోదావరి, కాంస్య పతకం), 45 కేజీల విభాగంలో ఆర్. భవాని (పశ్చిమ గోదావరి, బంగారు పతకం), 82 కేజీల విభాగంలో బి. గీతా రెడ్డి (కడప, వెండి పతకం), నవ్యశ్రీ (తూర్పుగోదావరి, కాంస్యం), అండర్-19 విభాగంలో 120 కేజీల బరువెత్తి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన షరీన్ పి. బెన్నీ బంగారు పతకం సాధించింది. 91 కేజీల బరువు ఎత్తి కడప జిల్లాకు చెందిన వెలంగిణీ వేద కాంస్య పతకం సాధించింది. విజేతలకు శనివారం సాయంత్రం బహుమతులు అందజేస్తామని ఆయన వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వ్యాయామ ఉపాధ్యాయుడితో ఎంపికైన విద్యార్థి

గడివేముల: కరిమద్దెల జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న మహేష్ రాష్ట్రస్థాయి అండర్-14 బాల్‌బ్యాట్‌మెంటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.ఈ నెల 25,26 తేదీల్లో శ్రీకాళం జిల్లాలోని కేశవరావు పేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆ విద్యార్థి పాల్గొనున్నట్లు చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థిని మహేష్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు, సర్పంచ్ సుంకన్న, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటలతో మానసికోల్లాసం

కల్లూరు: ఆటలు ఆడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి సుపరింటెండెంట్, డాక్టర్ సయ్యద్ పాషా, నారాయణ పాఠశాలల ఏజీఎం రమేషకుమార్ అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధి ఎల్కూరు బంగ్లా ఆవరణలో ఈ కిడ్స్ విభాగంలో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ సయ్యద్ పాషా మాట్లాడుతూ పిల్లలో మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదపడతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బ్రాంచ్‌ల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈ-కిడ్స్ కో-ఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి..

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 108సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తమ్మరాజుపల్లెలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గ్రామ సమీపంలో బైక్ అదుపుప్పి జాతీయ రహదారిపై కింద పడ్డాడు. దారిలో వెళ్లే వాహనదారులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తర్వాత చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వెంకటేశ్వర్లు వద్ద రూ. 4,570 నగదు, మొబైల్, పాన్, ఆధార్ కార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్ ఉంది. వాటిని క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు అందించినట్లు 108 సిబ్బంది ప్రసాద్, తిరుపాల్ తెలిపారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని భారత్‌పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో బేతంచెర్లకు చెందిన సురేష్ అనే వ్యక్తి గాయపడ్డాడు. నంద్యాలకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

అవీ-ఇవీ

న్యాయమైన పరిహారం ఇచ్చే వరకు పోరాటం

కర్నూలు (సిటీ) : ఆరులైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఆర్‌కే దుద్యాల గ్రామంలో ఆరు లైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు పరిహారం ఇవ్వక ముసుపే పనులు మొదలుపెట్టడం అన్యాయమన్నారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను వివిధ నిర్మాణాల పేరుతో నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకోవడం సరికాదన్నారు.

26న వీరశైవుల కార్తీక వన భోజనం

కర్నూలు కల్చరల్: వీర శైవ అభ్యుదయ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన గుత్తి రోడ్‌లోని వీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వన భోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లికార్జునప్ప, కాశీ విశ్వనాథ్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వీర శైవ కుల సంఘీయులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

13న గొర్రెలు, మేకల పెంపకందారుల సదస్సు

కర్నూలు(సెంట్రల్) : గొర్రెలు, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సును డిసెంబర్ 13వ తేదీన డోన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కారన్న తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గొర్రెలు, మేకల పెంపకందారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎన్ఎస్‌డీఎస్ కింద గొర్రెలు, మేకల కొనుగోలుకు నిధులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు గురుదాస్,మహేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు (సిటీ) :బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ శుక్రవారం అందజేశారు. ఆయన స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. కోడుమూరులోని లక్ష్మీనగర్‌కు చెందిన మాదుగుందు సుజాతకు రూ.1,50,000, కర్నూలు రూరల్ మండల పరిధిలోని బి.తాండ్రపాడుకు చెందిన ఆకెపోగు మహేశ్వరమ్మకు రూ.3.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో బి.తాండ్రపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే పక్కాగా నిర్వహించాలి

- డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కల్లూరు: కుల గణన సర్వే పక్కాగా నిర్వహించాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో కుల గణన సర్వే, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ సర్వే సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి యజమానితో మాట్లాడి వివరాలు తెలుసుకోవాలన్నారు. సర్వే నిర్వహణకు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కుల సంఘాల నాయకులు సహకరించాలన్నారు.

- అలాగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈ నెల 29 నుంచి డిసెంబర్ 9వ మండలంలో జరుగుతుందని డీఎల్‌డీఓ, ఎంపీడీఓ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడమే యాత్ర ఉద్దేశమని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, పీఎం ఉజ్వల, కేసీపీ, పేదలకు ఉచిత గృహాలు పథకాలకు అర్హులై ఉండి లబ్ధి పొందకపోతే వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- అలాగే ఆడుదాం ఆంధ్రం కార్యక్రమానికి సంబంధించి నేటి నుంచి సచివాలయంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయన్నారు. వాలిబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో క్రీడాలకు సంబంధించి క్రీడాకారులు సచివాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవి కిషోర్, ఏఎస్ఓ ప్రతాప్ సాగర్ పాల్గొన్నారు.

వీబీఎస్‌వైని జయప్రదం చేయండి



వీబీఎస్‌వై నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి, డీపీఓ మంజులవాణి

పాణ్యం: దేశం వ్యాప్తంగా నేడు ప్రారంభం కానున్న వీబీఎస్‌వై (వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర)ను జయప్రదం చేయాలని జిల్లా ఫ్యామిలీ కాన్సెప్ట్ డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి, డీపీఓ మంజులవాణి, ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. మండల పరిధిలోని కొణిదేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీబీఎస్‌వై కార్యక్రమం నిర్వహణకు అవసరమైన స్థలాన్ని, సదుపాయాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు హెల్త్ కార్డులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీతా, ఎంపీడీఓ దస్తగిరి, ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి, ఎంఈఓ కోటయ్య , గ్రామ కార్యదర్శి సామన్న, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలి



బాధిత మహిళలకు మద్దతు తెలుపుతున్న కురువ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్) : కల్లూరుకు చెందిన కురువ సుగుణ, లక్ష్మీల నుంచి 12 ఏళ్ల క్రితం రూ.15 లక్షలు తీసుకొని మోసం చేసిన డీఎస్పీ యుగంధర్‌బాబు మామ కమ్మ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని కురువ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ధర్నా చౌక్‌లో తమకు న్యాయం చేయాలని కురువ సుగుణమ్మ, లక్ష్మీల దీక్షకు దిగారు. వారికి మద్దతుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, కురువ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన కిరణ్‌కుమార్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, శేషఫణి, కల్లూరు మండల మాజీ ఎంపీపీ పెద్దఅమీన్, అల్లబాబు, పుల్లన్న, వెంకటేశ్వర్లు, పొన్నకల్ నాగేష్, బీసీ తిరుపాలు, శ్రీరాములు, మద్దిలేటి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు స్పందించి బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

వైఎస్ఆర్‌సీపీ పాలనలోనే సామాజిక అభివృద్ధి



కె.మార్కాపురంలో వైఎస్ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



హుసేనాపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఆలమూరులో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న నాయకులు, అధికారులు

ఓర్వకల్లు/పాణ్యం/కల్లూరు: వైఎస్ఆర్‌సీపీ పాలనలోనే రాష్ట్రంలో సామాజిక అభివృద్ధి జరుగుతుందని గ్రామ, మండల ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల బోర్డులను ప్రదర్శించారు. వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు, వాటి వల్ల కలిగిన లబ్ధి గురించి ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు. ఓర్వకల్లు మండలంలోని హుసేనాపురం సచివాలయం-2 పరిధిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేస్తుందన్నారు.గ్రామ సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, స్థానిక నాయకులు జీకే వెంగన్న, చంద్ర పెద్దస్వామి, మాజీ సర్పంచు చిన్న అయ్యన్న, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమపాలన

పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్వేర్లు, సర్పంచ్ ముల్ల మహ్మద్ షరీఫ్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు, కార్పొరేటర్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు పోలీసు కాలనీలో ' ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనన్నే కావాలి ', మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 80వ వార్డు సచివాలయంలో 33 రకాల సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. చెన్నమ్మ సర్కిల్ సమీపంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహులు, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, శివశంకర్ రెడ్డి, శివ, హుస్సేన్ సాహెబ్, గోపీనాథ్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కె.మార్కాపురంలో..

కల్లూరు మండల పరిధిలోని కె.మార్కాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ కేశవరెడ్డి, సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.